సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 10 । జనవరి । 2025

నేడు ఉత్తర ద్వారం నుంచి దర్శనం



అరసవల్లి: ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ఆదిత్య క్షేత్రం ముస్తాబైంది. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి ప్రత్యేకంగా ఉత్తర ద్వార దర్శనాలు జరిగేలా ఆలయ ఈఓ వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో అరసవల్లిలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వేకువజామున శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీ వారి ఉత్సవమూర్తులను తిరువీధిగా తీసుకెళ్లి అనంతరం అనివెట్టి మండపంలో ఏకాదశి కల్యాణాన్ని జరిపించేలా చర్యలు చేపడుతున్నారు. రూ.500 చెల్లించిన భక్త దంపతులకు ఈ కల్యాణ సేవలో పాల్గొనేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆలయం వద్ద భవనాల కూల్చివేత పనులు జరుగుతుండడంతో భక్తులు జాగ్రత్తగా రావాలని వారు కోరారు. అన్నదాన ప్రసాదాన్ని కూడా ఇంద్రపుష్కరిణి వద్ద శ్రీవైజయంతి మండపంలో నిర్వహిస్తున్నామని ఈవో భద్రాజీ ప్రకటించారు.

అగ్నివీర్ పోస్టులకు నోటిఫికేషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: భారత వాయుసేన 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, సికింద్రాబాద్ ద్వారా క్లరికల్, టెక్నికల్ క్యాడర్‌లలో అగ్నివీర్, వాయు పోస్టులకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ గురువారం తెలిపారు. ఇంటర్, ఐటీఐ/డిప్లొమా (పాలిటెక్నిక్) పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. 2025 జనవరి 27 వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ http:agnipathvayu.cdac.in దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

సెలవు రోజుల్లో బడులు తెరిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సంక్రాంతి సెలవుల్లో బడులు తెరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు పాటించాలని, 20వ తేదీన తిరిగి పునఃప్రారంభమవుతాయని డీఈఓ తెలిపారు. ఇదిలా ఉండగా సంక్రాంతి సెలవు రోజుల్లో ప్రత్యేక క్లాసుల పేరిట పాఠశాలలు తెరిచినా, క్లాసులు చెప్పించినా, విద్యార్థులను బడులకు పిలిపించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఫిర్యాదులు వస్తే సదరు పాఠశాలలపై కఠిన చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరించారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న కలమట



ఆకులతంపర ర్యాంపు వద్ద ఇసుక తవ్వకాలను అడ్డుకున్న కలమట వెంకటరమణ

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అడ్డుకున్నారు. నదీ గర్భంలో పొక్లెయినర్లతో తవ్వకాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. వాహనాలను సీజ్ చేయాలని స్థానిక తహసీల్దార్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం



విజయ స్థూపం వద్ద కేక్ కట్ చేస్తున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్ : జనం గుండె చప్పుడు వింటూ.. దగా పడ్డ ప్రజల కన్నీళ్లు తుడుస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకమని నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పటి టీడీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర తుది ఘట్టానికి చేరి గురువారానికి ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద నిర్మించిన విజయస్థూపం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాటి టీడీపీ చీకటి పాలన నుంచి ప్రజల్ని విముక్తులను చేసేందుకు జగనన్న చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు కోట్లాది మంది ప్రజలు జేజేలు పలికారని పిరియా విజయ అన్నారు. జగనన్న పడి లేచిన కెరటం వంటి వారని, ఓటమి చెందినప్పటికీ మనోధైర్యంతో కార్యకర్తలకు అండగా ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, జెడ్పీటీసీలు ఉప్పాడ నారాయణమ్మ, తడక యశోద, ఇప్పిలి లోలాక్షి, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్తు శివాజీ, మండల సమన్వయకర్తలు కడియాల ప్రకాశ్, తడక జోగారావు, ప్రకాశ్ పట్నాయక్, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, చాట్ల తులసీదాసురెడ్డి, సల్ల దేవరాజు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాన్యుడికి శరాఘాతం

నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు

- ఈహెచ్‌ఎస్ సేవలు పూర్తిగా నిలిపివేత
- ఎమర్జెన్సీ సేవలను మినహాయిస్తున్న నెట్‌వర్క్ ఆశా ప్రతినిధులు
- జిల్లాలో మొత్తం 13 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులను అనుమతించని యాజమాన్యాలు
- ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు



జేబులో రూపాయి లేకున్నా నిరుపేదను కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లిన ఆరోగ్య శ్రీపై కుట్ర జరుగుతోంది. నెలజీతం అయిపోయినా సామాన్యుడికి చికిత్స చేయించిన పథకంపై కొందరి క్షుద్ర దృష్టి పడింది. లక్షలాది మంది గుండె చప్పుడును కాపాడిన సంజీవనిపై రాజకీయ క్రీనీడ కమ్ముకుంటోంది. పేదింటి ఆడ పడుచుల పసుపు కుంకుమలు కాపాడిన ఈ మహాయాగాన్ని సాగనివ్వకుండా చేసే ప్రయత్నం జరుగుతోంది. జిల్లాలో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయి. ఎమర్జెన్సీ అయితే తప్ప సామాన్యుడు కార్డు పట్టుకుని ఆస్పత్రి గడప తొక్కడానికి లేదు.

అరసవల్లి:

ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయి. ఈ పథకానికి నెట్‌వర్క్ ఆస్పత్రులుగా ఉన్న యాజమాన్యాలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా రూ.3 వేల కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో పెట్టింది. దీనిపై ఏపీ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆశ) రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. కనీసం రూ.2 వేల కోట్ల వరకు బకాయిలు తీర్చాలని లేదంటే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని హెచ్చరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలన్నీ నిలిపివేశారు. ఈ క్రమంలో జిల్లాలో కూడా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) సేవలను కూడా గత రెండు రోజులుగా నిలిపివేశారు. దీంతో వేలాది మంది రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వైఖరిపై మండిపడుతున్నారు.

బకాయి రూ.78 కోట్లు

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 17 ప్రభుత్వ ఆస్పత్రులు, 13 ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అమలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆశా ప్రతినిధుల మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఇప్పటికే ఆరోగ్యశ్రీ సేవలను, ఈహెచ్‌ఎస్ సేవలన్నీ నిలిపివేశారు. అక్కడక్కడ ఎమర్జెన్సీ సేవలను మాత్రం అనుమతిస్తున్నారు. ఇక ఈహెచ్‌ఎస్ కింద ఎలాంటి కేసును టేకప్ చేయడం లేదు. జిల్లాలో ఉన్న ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.78 కోట్ల వరకు బకాయిలను చెల్లించకపోవడంతో సాధారణ ఆరోగ్యశ్రీ కేసులను పూర్తిగా నిలిపివేశారు. ఆరోగ్యశ్రీ కియోస్క్ వద్దకు రాగానే రోగులను వెనక్కి పంపించేస్తున్నారు. సాధారణ ప్రొసీజర్లను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలో ప్రధానమైన నాలుగు ఆస్పత్రులను గురువారం 'సాక్షి' పరిశీలించగా ఆరోగ్యశ్రీ కేసుల సంఖ్య వందల్లో ఉన్నాయి. అయితే ఇందులో నాలుగో ఐదో ఎమర్జెన్సీ కేసులు మినహా మిగిలినవన్నీ ఈహెచ్‌ఎస్, సాధారణ ఆరోగ్యశ్రీ కేసులే ఉన్నాయి. ఇవన్నీ ఆయా ఆస్పత్రుల గుమ్మం నుంచే వెనక్కివెళ్లేలా ఆస్పత్రి యాజమాన్యాలు ఏర్పాట్లు చేసుకున్నాయి.

ఆందోళనలో రోగులు

జిల్లాలో తెల్లరేషన్ కార్డు దారులు అధికంగా ఉన్నారు. రోడ్డు ప్రమాదాలు, జన్యుపరంగా వస్తున్న రోగాలు, ఆరోగ్య సమస్యలతో వస్తున్న జబ్బులతో వేలాది మంది నిత్యం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకుని నగదు రహిత వైద్యాన్ని పొందుతున్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత రెండు రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఎక్కడికక్కడ నిలిపివేశాయి. ఆరోగ్యశ్రీ కియోస్క్ వద్దకు వచ్చి కార్డు చూపించగానే అనుమతి లేదనడంతో బాధగా వెనుదిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత మరిచి ఇలా ప్రజారోగ్యంపై విషం చిమ్మడంతో రోగులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



ఓ ఆస్పత్రిలో వైద్యసేవలు నిరాకరించడంతో దిగాలుగా కూర్చున్న ఆరోగ్యశ్రీ రోగులు

నాడు ఆరోగ్యశ్రీ.. నేడు అనారోగ్యశ్రీ

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం దిగ్విజయంగా సాగింది. రూ.25 లక్షల గరిష్ట ప్యాకేజీ వరకు ఉచిత వైద్యాన్ని అందించేలా నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని కొనసాగించారు. అలాగే 2019కి పూర్వం వరకు ఈ పథకం కింద కేవలం 1000 ప్రొసీజర్లుంటే వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ ప్రొసీజర్లను 3257కి పెంచారు. అలాగే రోగులకు శస్త్రచికిత్స సమయంలో ఉపాధి కోల్పోవడంతో ఆసరా పథకంగా రూ.5 వేలు నగదును జమ చేశారు. దీంతో పాటు అత్యవసర శస్త్రచికిత్సలకు చెన్నై, బెంగళూరు, ఢిల్లీ తదితర పెద్ద నగరాలకు సైతం తీసుకెళ్లేలా మార్పులు చేశారు. ఎన్నికల ముందు నోటిఫికేషన్ సమయం నుంచి ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలతో పాటు కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ బకాయిలు రూ.3 వేల కోట్లకు చేరాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బకాయిలును చూపిస్తూ ఆరోగ్యశ్రీని పూర్తిగా నిలిపివేసి ప్రైవేటు బీమా కంపెనీలకు దారాదత్తం చేసేలా కుట్రలు పన్నుతోంది.

తిరుపతి ఘటనపై ఆగ్రహం

బాధ్యులెవరు..?




తిరుపతిలో జరిగిన ఘోర ప్రమాదానికి బాధ్యులు ఎవరని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. ఆయన గురువారం ఆమదాలవలసలోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఘటనలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. ఈ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు టీటీడీ అధికారులు, ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారన్నారు. ఇది పోలీసులు వైఫల్యమని, టీటీడీ వైఫల్యమని వంతులాడుకుంటున్న విషయం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందన్నారు. గతంలో వైకుంఠ ఏకాదశి వస్తుందంటే 20 రోజులముందే కార్యాచరణ చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేవారని గుర్తుచేశారు. ఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. –ఆమదాలవలస

నేడు శాంతి పూజలు



తిరుపతిలో జరిగిన దురదృష్టకర సంఘటనలో ఆరుగురు మృతి చెందడం బాధారమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత కొన్ని నెలలుగా తిరుమల శ్రీవారి ప్రతిష్టకు భంగం కలిగే విధంగా జరుగుతున్న అనేక సంఘటనల మూల్యమే నిన్నటి దుర్ఘటన అని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనకు కారకులైన వారిని శిక్షించాలని, ఆ ఏడుకొండల స్వామి శాంతించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శరణు కోరుతున్నామని అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు మందస మండల కేంద్రంలో ఉన్న వాసుదేవ్ పెరుమాళ్ స్వామి ఆలయంలో ప్రత్యేక శాంతిపూజలు నిర్వహిస్తామని తెలిపారు. –కాశీబుగ్గ

రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి



తిరుమల తొక్కిసలాటలో ఆరు మంది మృతి చెందడంపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో పాటు టీటీడీ పాలకవర్గం బాధ్యత వహించాలని, మృతుల కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. –ఇచ్ఛాపురం రూరల్

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే తిరుపతిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గతంలోనూ సీఎం చంద్రబాబు హయాంలోనే పుష్కరాల్లో భక్తుల ప్రాణాలు పోయాయని గుర్తు చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా జారీ చేసే టోకెన్ల విషయంలో ప్రస్తుత టీటీడీ చైర్మన్, పాలక మండలి సభ్యులకు ఎటువంటి అవగాహన లేకపోవడం దారుణమన్నారు. ఘటనపై టీటీడీ చైర్మన్, పాలక మండలి సభ్యులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. –టెక్కలి

సరదా సంక్రాంతి



సారవకోట: జేబీటీ పాఠశాల ఆవరణలో భోగి పిడకల కుప్పతో పాఠశాల సిబ్బంది

జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో గురువారం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేశారు. హరిదాసు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. గోదా కల్యాణం ప్రదర్శించారు. సంప్రదాయ దుస్తులతో సంక్రాంతిని సరదాగా నిర్వహించారు.



శ్రీకాకుళం: న్యూసెంట్రల్ స్కూల్‌లో పులివేషంలో విద్యార్థి



కంచిలి పాఠశాలలో గోదాకల్యాణం ప్రదర్శన



కాశీబుగ్గ: రామక్రిష్ణాపురం పాఠశాలలో ఆకట్టుకున్న గంగిరెద్దుల ప్రదర్శన



నరసన్నపేట దేశవానిపేట బీసీ బాలికల వసతి గృహంలో భోగి మంట వేస్తూ సందడి చేస్తున్న విద్యార్థినులు



పాతపట్నం హరిదాసు వేషధారణలో విద్యార్థి



టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పతంగులతో సందడి చేస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

పల్లెకు పోదాం..



సంక్రాంతికి ఆర్టీసీ అదనపు సర్వీసులు

- నేటి నుంచి 13వ తేదీ వరకూ ప్రత్యేక సర్వీసులు
- ఇరువైపులా టికెట్ తీసుకుంటే 10శాతం రాయితీ
- ప్రత్యేక సర్వీసులకు సింగిల్‌ఫేర్ మాత్రమే

శ్రీకాకుళం అర్బన్:

సంక్రాంతికి ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. ప్రయాణికులపై అదనపు భారం పడకుండా చార్జీలు పెంచకుండానే ఈ సర్వీసులు నడపనున్నారు. 10వ తేదీ నుంచి 40 బస్సులను అదనంగా నడపనున్నారు.

హైదరాబాద్ నుంచి..

ముఖ్యంగా హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే వారిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఇప్పటికే ప్రత్యేకంగా వేసిన బస్సులకు రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. ఈనెల 10వ తేదీన హైదరాబాద్ నుంచి 6 ప్రత్యేక బస్సులు, 11న 6, 12న 5, 13వ తేదీన 3 బస్సులు మొత్తంగా 20 బస్సులు జిల్లాకు చేరుకోనున్నాయి.

విజయవాడ నుంచి

విజయవాడ నుంచి శ్రీకాకుళానికి ప్రతి రోజూ యథావిధిగా తిరిగే 10 బస్సులకు అదనంగా 11వ తేదీన ఒక బస్సు, 12న ఒక బస్సు అదనంగా నడపనున్నారు. అదేవిధంగా రాజమండ్రి నుంచి శ్రీకాకుళానికి యథావిధిగా తిరిగే 5 సర్వీసులకు అదనంగా మరో 2 బస్సులు వేశారు. అలాగే రావులపాలెం నుంచి 1, అమలాపురం నుంచి 2, కాకినాడ, భద్రాచలానికి ఒక్కో బస్సు చొప్పున రెగ్యులర్‌గా తిరిగేవి అందుబాటులో ఉన్నాయి.

విశాఖపట్టణం నుంచి


శ్రీకాకుళం జిల్లాకు విశాఖపట్టణం నుంచే ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇందుకోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి ప్రతిరోజూ 25 నాన్‌స్టాప్‌లు, 23 పల్లెవెలుగులు తిరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకూ విశాఖపట్టణం నుంచి శ్రీకాకుళానికి ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకూ ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడపనున్నారు. జిల్లాలో మొత్తం 332 బస్సులు ఉన్నాయి. నాలుగు డిపోల పరిధిలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

అన్ని చర్యలు తీసుకున్నాం..



సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. విశాఖ నుంచి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ఉండేలా చర్యలు చేపట్టాం. జిల్లాలో కూడా మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

– ఎ.విజయ్‌కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి

10 శాతం రాయితీ

ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కు ఆర్టీసీ సంస్థ రాయితీతో కూడిన ప్రయాణ చార్జీని ప్రవేశపెట్టింది. గతంలో ఆర్టీసీ ఏసీ బస్సులకు మాత్రమే రాయితీ ఉండేది. ఇప్పుడు ఏసీ, సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ వంటి సర్వీసులకు రాను, పోను ఒకేసారి టికెట్ తీసుకుంటే ప్రయాణ చార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నారు. ఈ–వాలెట్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 5శాతం రాయితీ ఇస్తున్నారు.

చెంచుల నృత్యాలు



సంక్రాంతి సందడి మొదలైంది. ప్రత్యేక వేషధారణతో అలరించే చెంచులు నరసన్నపేటలో సందడి చేశారు. గుండవల్లిపేటకు చెందిన వీరంతా సంప్రదాయ నృత్యాలతో అలరించారు. సంక్రాంతి వరకు ప్రతి గ్రామానికి వెళ్లి సందడి చేస్తామని చెంచుల బృంద నాయకుడు ఆవల జగన్నాథం తెలిపారు.

– నరసన్నపేట

క్లుప్తంగా

డిజిటల్ లైబ్రరీతో మేలు

శ్రీకాకుళం న్యూకాలనీ : పోటీ ప్రపంచయుగానికి తగ్గట్టుగా మారుతున్న సాంకేతికతను అందుపుచ్చుకుంటూ విద్యార్థులు గ్రంథాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. గురువారం కళాశాల లైబ్రేరియన్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ డిజిటల్ లైబ్రరీ సేవలపై కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుతున్న లైబ్రేరియన్ సైన్స్ విభాగం ఇన్‌చార్జి పీఎల్పీ భారతిని ప్రిన్సిపాల్‌తోపాటు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకర్‌నారాయణ, సీహెచ్ కృష్ణారావు, ఎస్.పద్మావతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో కబడ్డీ పోటీలు

ఎచ్చెర్ల : స్వామి వివేకానందుడి 162వ జయంతి సందర్భంగా ధర్మవరంలో ఈ నెల 11, 12వ తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మేము సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు టీకే ఆచారి తెలిపారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసుగా రూ.8వేలు, రూ.5వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9182254531, 8143299133 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విధి నిర్వహణలో ఆశ కార్యకర్త మృతి


గుండెపోటు రాకముందు మందులను అందిస్తున్న చంద్రకళ

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న కెంబూరి చంద్రకళ(50) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఉదయం 9 గంటల సమయంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి మందులు సరఫరా చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు సపర్యలు చేసేటప్పటికే మృతిచెందారు. ఈమె 20 ఏళ్లుగా ఆశ కార్యకర్తగా సేవలు అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, ఏఎన్ఎంలు, తోటి ఆశ కార్యకర్తలు సంతాపం తెలిపారు. చంద్రకళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నాటుబాంబు పేలి వ్యక్తికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ పరిధిలో గురువారం నాటుబాంబు పేలి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అడవి పందులను మట్టుబెట్టడానికి నాటుబాంబును తయారు చేస్తుండగా వ్యక్తి చేతిలో పేలడంతో నాలుగు వేళ్లు తెగి పడినట్లు తెలుస్తోంది. గాయపడిన వ్యక్తిని పలాసలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

వాహనచోదకులకు తప్పిన పాట్లు


జేసీబీతో చెట్ల వ్యర్థాలను తొలగిస్తున్న కార్పొరేషన్ అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాలకొండ రోడ్డులో చెట్ల తొలగింపుతో ఇబ్బందులు పడిన వాహనచోదకులకు గురువారం ఉపశమనం లభించింది. పండుగ పూట ఇవేం పనులు పేరిట సాక్షిలో గురువారం కథనం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తెల్లవారేసరికి పనులు ప్రారంభించి షాపులు తెరిచే సమయానికి చెట్లు, వ్యర్థాలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు. మరోవైపు, డివైడర్ల మధ్య ఐరన్ తీసుకెళ్లారని తెలియడంతో స్క్రాప్ షాపుల్లో తనిఖీలు చేపట్టి తిరిగి తీసుకొచ్చినట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ తెలిపారు.

ఆదిత్యాలయంలో ఆకట్టుకున్న రంగవల్లులు


క్షేత్రపాలక మండపంలో పుష్పాలతో రంగవల్లులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో క్షేత్ర పాలకులైన భువనేశ్వరి సహిత రామలింగేశ్వర స్వామి వారి మండపంలో వివిధ రకాల పుష్పాలతో రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ధనుర్మాసం కావడంతో అర్చకులు ఇప్పిలి శ్రీహర్ష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

అర్జీలపై నిర్లక్ష్యమెందుకు?


హాజరైన రెవెన్యూ అధికారులు


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- రెవెన్యూ, సర్వే సిబ్బంది తీరుపై కలెక్టర్ అసంతృప్తి
- వీఆర్‌వోల గైర్హాజరుపై అసహనం
- 24 సబ్జెక్టుల్లో కేవలం 8 అంశాలే పైనే చర్చ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, సర్వే విభాగాల్లో రైతులు పెట్టుకున్న అర్జీల పరిష్కారం ఆలస్యం అవుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని, ఈ తీరు మారాలని అన్నారు. అధికారుల తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలసత్వానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా సిబ్బంది పెద్దగా హాజరు కాకపోవడంతో కలెక్టర్ సమావేశం ప్రారంభించకుండానే వెళ్లిపోయి, తిరిగి రెండు గంటలకు ప్రారంభించారు. అయితే రోజంతా జరగాల్సిన ఈ సమావేశంలో 24 రెవెన్యూ, సర్వే అంశాలపై సమీక్ష జరగాల్సి ఉండగా సిబ్బంది హాజరు కాకపోవడంతో కేవలం 8 అంశాలపై మాత్రమే సమీక్షించారు. కొంతమంది రెవెన్యూ అధికారులు పూర్తి సమాచారంతో రాకపోవడంతో కలెక్టర్ వారిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఒక దశలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అందరినీ సస్పెండ్ చేయాలని, అప్పుడే మార్పు వస్తుందని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు రశీదులు ఇవ్వాలని, అర్జీలను ఆన్‌లైన్ చేయాలని, అర్జీదారుల ఫోన్ నంబర్లను సరిగ్గా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎం.అప్పారావు, బి.పద్మావతి, లావణ్య, ఆయా మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు హాజరయ్యారు.

సంక్రాంతి సెలవులు అమలు చేయాల్సిందే

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు పక్కాగా అమలు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే జిల్లాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఏ యాజమాన్యానికి ఎటువంటి మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఏపీఎస్‌సీపీసీఆర్2018ఎట్‌జీమెయిల్‌డాట్‌కామ్‌కు మెయిల్ చేయవచ్చని పేర్కొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా?


అవగాహన కల్పిస్తున్న రెండవ పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇతర గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు సూచించారు. ఈ మేరకు నగరంలో గురువారం అవగాహన కల్పించారు. ఆభరణాలు వెంట తీసుకెళ్లాలని, లేనిపక్షంలో బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇరుగుపొరుగు వారికి గానీ, సమీప పోలీస్ స్టేషన్‌లో గానీ తెలియజేస్తే లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఐహెచ్‌ఎంఎస్) ద్వారా భద్రత కల్పిస్తామన్నారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

'వంశధార'కు రూ.1500 కోట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వంశధార ప్రాజెక్ట్ ఆధునికీకరణకు రూ.1500 కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహనరావు డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రాజెక్టు శిథిలమైతే జిల్లాలో వ్యవసాయ రంగం కుప్పకూలిపోతుందన్నారు. ప్రాజెక్ట్ ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నది ఎడమ కాలువ ద్వారా లక్షా యాభై వేల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలు, హై లెవెల్ కెనాల్ ద్వారా 5 వేల ఎకరాలు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలకు నీరందిస్తున్న ప్రాజెక్టుపై నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. వంశధార ఆధునీకరణ కోసం కుడి కాలువ 104 కిలోమీటర్లు, ఎడమ కాలువ 73 కిలోమీటర్లు పొడవునా లైనింగ్‌కు రూ.800 కోట్లు, 250 స్ట్రక్చర్స్ పునర్ నిర్మాణానికి రూ.300 కోట్లు, షెట్టర్స్‌కు రూ.100 కోట్లు, పిల్ల కాలువలు మరమ్మతులకు రూ.300 కోట్లు నిధులు అవసరమవుతాయని నిపుణులు చెబుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ చేసి రెండు పంటలకు నీరు ఇస్తే వ్యవసాయ రంగం నుంచి రూ.1000కోట్లకు పైగా ఆదాయం వస్తుందన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ఎచ్చెర్ల: విజేతలుగా నిలిచిన వెంకటాపురం విద్యార్థులు


జి.సిగడాం: జాడ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: రణస్థలం మండలం జేఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించిన ఎచ్చెర్ల నియోజకవర్గ అంతర పాఠశాలల గ్రిగ్స్ పోటీలలో లావేరు మండలం వెంకటాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బ్యాడ్మింటన్ జూనియర్ బాలిక విభాగంలో ఎస్.పూజిత, ఎల్.జయలక్ష్మి, టెన్నికోయిట్‌లో ద్వితీయ స్థానంలో ఎస్.పూజిత, పి.పూజిత విజయం సాధించారు. బ్యాడ్మింటన్ జూనియర్ బాలురు విభాగంలో డి.ఉదయ్, జి.ధనుష్, సీనియర్ బాలికల విభాగంలో ఎం.రాజేశ్వరి, ఎం.మేఘన విజేతలుగా నిలిచారు. సీనియర్ బాలురు విభాగంలో డి.వంశీ, జె.దినేష్‌లు, టెన్నికాయిట్ విభాగంలో డి.వంశీ, ఎస్.తరుణ్‌లు విజయం సాధించారు. విజేతలను హెచ్‌ఎం ఎస్.అరుణకుమారి, పీడీ పి.సూర్యారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జి.సిగడాం: రణస్థలం మండలంలో ఇటీవల డివిజన్ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో జాడ ప్రాథమికోన్నత పాఠశాల బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించారు. వీరిని హెచ్‌ఎం బెవర రామినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకటనాయుడు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.


ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడాకారులను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాండిచ్చేరిలో ఈ నెల 11 నుంచి జరగనున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు కేశవరావుపేట ఉన్నత పాఠశాలకు చెందిన పొందూరు హరికృష్ణ, గురుగుబెల్లి దుర్గాప్రశాంతి, పొందరు లావణ్య ఎంపికయ్యారు. వీరిని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, సెక్రటరీ చిగిలిపెల్లి లక్ష్మీదేవి, హెచ్‌ఎం బి.వి.సాయిరాం, పీడీలు ఎం.వి.రమణ, జి.మల్లేష్ గురువారం అభినందించారు.

ఉత్తరాంధ్రులను మోసగించారు

శ్రీకాకుళం : ప్రధాని మోదీ చేపట్టిన విశాఖపట్నం పర్యటన ఉత్తరాంధ్ర ఆంధ్రప్రజానీకాన్ని మళ్లీ మోసం చేసినట్లయిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఏ.అజాశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర కూటమి నాయకులు ఒకరినొకరు పొగడ్తలతో సరిపెట్టుకున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్ ఊసే ఎత్తకుండా దాటవేశారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీని పూర్తిగా మరిచిపోయారన్నారు. ప్రజలు వద్దు మొర్రో అంటున్న బల్క్ డ్రగ్ ప్లాంట్ శంకుస్థాపన ఎవరికోసమని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి వెనకబెట్టిన రైల్వేజోన్ శంకుస్థాపనలో గర్వపడడానికి ఏముందన్నారు. విశాఖ ప్రజల తరపున గొంతు వినిపించాల్సిన వామపక్ష నాయకులను నిర్బంధించటం ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు.

ఇబ్రహింబాద్‌లో కొట్లాట

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో సమీప బంధువుల మధ్య సివిల్ తగాదా గురువారం కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో గాయపడిన సీపాన రాజశేఖర్ శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు బాధితుడు ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి వర్గాలు వివరాలను ఎచ్చెర్ల పోలీసులకు పంపించారు.

90 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురం గ్రామానికి చెందిన బగ్గ ఈశ్వరరావు గురువారం అక్రమంగా మద్యం తరలిస్తుంగా ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. కొంగరాం సమీపంలో బైక్‌పై వెళ్తుండగా 90 బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఉపాధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం


శిక్షణలో మాట్లాడుతున్న ఏపీడీ లోకేష్

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లోకేష్ అన్నారు. ఎచ్చెర్ల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎచ్చెర్ల, ఆమదాలవలస మండలాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి గురువారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పనుల నిర్వహణలో కొలతలు కీలకమని చెప్పారు. ప్రతి జాబ్ కార్డుదారునికి 100 రోజుల పని కల్పించాలన్నారు. మేట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 50 మంది వేతనదార్లులకు ఒక మేట్‌ను నియమిస్తామన్నారు. గతంలో మహిళలను మాత్రమే నియమించేవారని, ప్రస్తుతం పురుషులకు సైతం అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ అనుసంధాన పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు గౌరినాయుడు, సందీప్, నారాయణమ్మ, సురేష్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పీఎం ఉషా నిధులు సకాలంలో వినియోగించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాలకు మంజూరైన పీఎం ఉషా నిధులు సకాలంలో వినియోగించాలని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి సునీల్‌కుమార్ బర్నేవల్ అన్నారు. ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ నిధుల వినియోగంపై దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల అధికారులతో గురువారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ తరఫున వీసీ రజని, రిజిస్ట్రార్ సుజాత హాజరయ్యారు. భవనాలు, ల్యాబ్‌లు, రీసెర్చ్ ప్రాజెక్టులు వంటివి ఏర్పాటు చేయాలని, అకడమిక్, పరిపాలన అంశాల్లో వర్సిటీలు ప్రగతి సాధించాలని, నైపుణ్య విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

కొబ్బరిలో సస్యరక్షణకు జీవ నియంత్రణ పద్ధతులు


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రణస్థలం: కొబ్బరిలో పంటకు హాని చేసే పురుగుల నివారణకు జీవ నియంత్రణ పద్ధతులు ఉపయోగపడతాయని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విశాలక్షి అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రావుపేటలో నిర్వహించిన జీవ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కొబ్బరిని ఆశించే రుగోస్ తెల్లదోమ నివారణకు 2018లో ఎంకార్షియా గడలోపే అనే బదానికలను కొబ్బరి తోటల్లో ప్రవేశపెట్టి ఐసేరియా అనే జీవ శిలీంధ్ర నాశిని పిచికారీ చేయడం వల్ల ప్రస్తుతం చాలా కొబ్బరి తోటల్లో ఇవి విస్తరించి తెల్ల దోమను నివారించాయని తెలిపారు. బెంగళూరు నుంచి విచ్చేసిన శాస్త్రవేత్త డాక్టర్ సెల్వరాజ్ మాట్లాడుతూ సామూహికంగా రైతులందరూ నివారణ చర్యలు చేపట్టడం వల్ల తెల్ల దోమ పురుగును అదుపులో ఉంచవచ్చని జీవ నియంత్రణ విధానాలు పాటించాలని కోరారు. అలాగే మిత్ర పురుగులను పొలంలో వదిలే విధానాన్ని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అనూష, హార్టికల్చర్ ఎం.అనూష, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్.హరిబాబు, ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, ఆర్.దేవుడుబాబు, బి.మూర్తి రైతులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, పార్లమెంట్ సభ్యుడు మాణిక్యం ఠాగూర్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పర్యటన విచ్చేసిన ఆయన గార మండలం అంబటివానిపేటలో జై బాపూజీ.. జై భీమ్.. జై సంవిధాన్.. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారతదేశ ప్రజలకు భగవద్గీత లాంటి పవిత్రమైన రాజ్యాంగాన్ని, రాసిన అంబేడ్కర్‌ను కించపరుస్తూ అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి షేక్ మస్తాన్‌వలి, గిడుగు రుద్రరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, మమతా నాగిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జ్ గాధం వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెల్ల సురేష్, కేపీఎల్ఎస్ ఈశ్వరి, తెంబూరు మధుసూదన్‌రావు, పూడి కిరణ్‌కుమార్, నియోజకవర్గాల ఇన్‌చార్జులు చక్రవర్తి రెడ్డి, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి అగ్రనేతలు శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రాగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గత ఎన్నికల్లో పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన వారు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. దీనికి కారణం పార్టీలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలేనని చెబుతున్నారు. గైర్హాజరైన వారిలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు సనపల అన్నాజీరావు, మంత్రి నరసింహమూర్తి, కొప్పురోతు వెంకటరావు, కరిమజ్జి మల్లేశ్వరరావు, కోత మధుసూదనరావు, చింతాడ దిలీప్, కొర్రాయి ప్రసాదరావు, కె.శైలజ ఉన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుడికి భరోసా

గార: కొర్లాం ప్రాథమిక పాఠశాల ఎంటీఎస్ ఉపాధ్యాయుడు పాపాచారి కిడ్నీ వ్యాధి బారిన పడటంతో తోటి ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించి మనోధైర్యాన్ని కల్పించడం అభినందనీయమని డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. పాపాచారిని పరామర్శించేందుకు డీఈవో గార ఎమ్మార్సీకి రాగా, అక్కడే ఇప్పటివర కు రూ.90 వేలను ఉపాధ్యాయులు సేకరించారన్న విషయం తెలుసుకుని తనవంతుగా రూ.10 వేలు కలిపి లక్ష రుపాయలు అందజేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎంఈవోలు ఎన్.రామకృష్ణారావు, వినోదిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్లలో కారం కొట్టి..

- పుస్తెలతాడు చోరీ

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం గ్రామంలో గురువారం వేకువజామున ఓ మహిళ కళ్లలో కారంచల్లిన గుర్తు తెలియని వ్యక్తులు పుస్తెలతాడు తెంచుకుని పరారయ్యా రు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం గ్రామానికి చెందిన జి.స్వప్న అనే మహిళ గురువారం వేకువజామున తన ఇంటి నుంచి బయటకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె కళ్లలో కారంచల్లారు. మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు తెంచుకుని వెళ్లిపోయారు. బాధితురాలు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని చల్లపేటకు చెందిన సీహెచ్ తిరుపతిరావు గురువారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ తగాదా కారణంగా మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలానికి వాడే గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) మారెడ్ల కృష్ణారావు (ఫైల్)

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామ సమీపంలో ముత్యాలమ్మ ఆలయం వద్ద జాతీయ రహదారిపై మ్యాక్సీ లగేజీ వ్యాన్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న చాకిపల్లి గ్రామానికి చెందిన మారెడ్ల కృష్ణారావు(54) అక్కడికక్కడే మృతి చెందాడు. ధాన్యం వ్యాపారం నిమిత్తం గురువారం మధ్యాహ్నం పాతపట్నం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పాతపట్నం సీఐ వి.రామారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. మ్యాక్సీ వ్యాన్ డ్రైవర్ పఠాన్ రంజాన్ స్వగ్రామం కొటబొమ్మాళి మండలం చిన్నబండి గ్రామం. మృతుడు కృష్ణారావు భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 253 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30న ప్రారంభమైన ఈ ఎంపికలు ఈ నెల 18వ తేదీ వరకు సెలవు రోజుల్లో మినహా కొనసాగనున్నాయి. గురువారం 638 మందికి గాను 400 మంది హాజరయ్యారు. 253 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఎంపిక ప్రక్రియ పరిశీలించారు.


పరుగుపోటీలో అభ్యర్థులు


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి


అభ్యర్థుల ఛాతీ కొలుస్తున్న దృశ్యం